APTEL/25/A2843

# క్రైం కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు దిన పత్రిక

సంపుటి : 01    సంచిక : 27    ప్రకాశం, మంగళవారం 21- 10 - 2025    పేజీలు : 4    వెల. 2

రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349



## జోగి రమేశ్ అరెస్టు ఖాయం

విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 19: నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ అరెస్టు కావటం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని తన కార్యాలయంలో బుద్దా వెంకన్న మీడియాతో మాట్లాడుతూ నకి లీ మద్యం తయారీలో జోగి రమేశ్ సూత్రధారుడని చెప్పారు. జోగి రమేశ్ నకిలీ మద్యం తయారు చేయించారని జనార్దన్‌రావు ఒప్పుకొన్నారని తెలిపారు. జోగి రమేశ్ వందల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకున్నారని, బెదిరించి అగ్రిగోల్డ్ ఆస్తులను రాయించుకున్నారని పేర్కొన్నారు. కావాలనే చంద్రబాబు నివాసంపై దాడికి జోగి రమేశ్ వచ్చారని తెలిపారు. మాజీ సీఎం హొదాలో ఉన్న నాయకుడి ఇంటికి నిరసన తెలపటానికి ఎలా వెళతారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు జగన్మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లవచ్చా అని నిలదీశారు. అమరావతి పై వైసీపీ స్టాండ్ మారినంతమాత్రాన ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జోగి రమేశ్‌కు దమ్ములేదు, దుమ్ములేవని ఎద్దేవా చేశారు.

## మనవడితో కలిసి రోడ్డుపై దీపావళి షాపింగ్.. ఈ పెద్దాయన ఎవరో తెలుసా?

**గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ దీపావళి సందర్భంగా తన మనవడితో కలిసి గాంధీనగర్ మార్కెట్‌లో షాపింగ్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. సామాన్యుడిలా స్థానిక వస్తువులు కొంటూ, విక్రేతలతో సంభాషించిన ఆయన ఫోటోలు వైరల్ అయ్యాయి. ప్రధాని మోడీ 'వొకల్ ఫర్ లోకల్' సందేశాన్ని చాటిచెప్పిన సీఎం సింప్లిసిటీకి ప్రజలు ముగ్ధులయ్యారు.**



దేశవ్యాప్తంగా దీపావళిని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ఈ వెలుగుల పండుగ సందర్భంగా అందరినీ ఆశ్చర్యపరిచే ఒక ఫోటో వైరల్ అవుతోంది. అదేంటంటే.. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సోమవారం దీపావళి జరుపుకోవడానికి తన మనవడితో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. ముఖ్యమంత్రి గాంధీనగర్ వీధుల్లో సాధారణ వ్యక్తిలా కనిపించారు. ఆయన తన మనవడితో కలిసి దీపావళికి షాపింగ్‌కు వెళ్లారు. ముఖ్యమంత్రి సామాన్యుడిలా షాపింగ్ చేయడం చూసి అక్కడున్న ప్రజలు, దుకాణదారులు ఆశ్చర్యపోయారు. ముఖ్యమంత్రి మార్కెట్‌లోని అనేక దుకాణాలను సందర్శించి, వస్తువులను చూసుకుంటూ, దుకాణదారులతో సంభాషించారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ స్థానిక విక్రేతల నుండి దీపాలు సహా వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వదేశీ, వోకల్ ఫర్ లోకల్ ప్రచారాన్ని ఈ విధంగా ప్రోత్సహించారు. ముఖ్యమంత్రి మనవడు కూడా మార్కెట్లో కొనుగోలు చేశాడు. అయితే వారు రోడ్డుపై షాపింగ్ చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక ఫోటోలో ముఖ్యమంత్రి పటేల్ ఒక దీపాల దుకాణం వద్ద నిలబడి ఉన్నట్లు కనిపిస్తుంది. మరొక ఫోటోలో ఆయన తన మనవడితో కలిసి రంగోలి దుకాణంలో కనిపిస్తున్నారు. ఈ సమయంలో ఒక పిల్లవాడు ముఖ్యమంత్రితో సెల్ఫీ తీసుకుంటున్నట్లు కనిపిస్తుంది.

మార్కెట్లో, ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ దుకాణదారులతో సంభాషించి వారికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి సింప్లిసిటీకి స్థానికులు ముగ్ధులయ్యారు. "సీఎం అంటే కామన్ మ్యాన్" అనే సామెతను భూపేంద్ర పటేల్ నిరూపించారు స్థానికులు చెప్పుకుంటున్నారు. అంతకుముందు ఆయన అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను షేర్ చేశారు.

## ఐక్యంగా రాష్ట్రాన్ని పునర్నిర్మిద్దాం.. ఆస్ట్రేలియాలోని ప్రవాసులతో లోకేశ్ భేటీ

**16 నెలల్లోనే 10 లక్షల కోట్ల పెట్టుబడులు.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

**కేంద్రం సహకారంతోనే గూగుల్ వచ్చింది.. దాంతోపాటు ఎంఎస్ఎంఈలూ ముఖ్యమే**

**చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ప్రవాసులు అండగా నిలబడ్డారు**

**ప్రపంచవ్యాప్తంగా నిరసనలు తెలిపారు.. 45 వేల మంది హైదరాబాద్ వచ్చి పాల్గొన్నారు**

**1995లో మాదిరిగా మ్యాజిక్ చేయడానికి బాబు అహర్నిశలూ కష్టపడుతున్నారు**

**అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా తీసుకెళ్తున్నారు**

**క్వాంటమ్ కంప్యూటింగ్ మాకే అర్థం కావడం లేదు.. ఆయనేమో నిశితంగా విశ్లేషిస్తున్నారు**

**అందుకే ఆయన విజనరీ.. ఇంకొకరు ప్రిజనరీ.. సిడ్నీ ప్రవాసాంధ్రుల భేటీలో వ్యాఖ్యలు**



అమరావతి, అక్టోబరు 19 రాష్ట్రం కోసం ప్రవాసాంధ్రులు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. అందరం ఐక్యంగా రాష్ట్రాన్ని పునర్నిర్మిద్దామని వ్యాఖ్యానించారు. తెలుగువారు మళ్లీ గర్వంగా తలెత్తుకునే రోజులు రావాలని ఆకాంక్షించారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన లోకేశ్‌కు ఆదివారం సిడ్నీలో ఘనస్వాగతం లభించింది. సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రవాసాంధ్రుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. కేంద్రం సహకారం వల్లే గూగుల్ డేటా సెంటర్ రాష్ట్రానికి వచ్చిందన్నారు. గూగుల్ ఎంత ముఖ్యమో.. ఎంఎస్ఎంఈలు కూడా అంతే ముఖ్యమని స్పష్టంచేశారు.

కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతాలు, ఎన్‌టీపీసీ గ్రీన్ ప్రాజెక్టు.. ఇలా అనేక కార్యక్రమాలను శరవేగంగా చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పీపీఏలను రద్దు చేసి ఖజానాకు ఆర్థికంగా నష్టం చేస్తే.. తాము అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రవాసాంధ్రులు బ్రాండ్ అంబాసిడార్లుగా మారాలని అభ్యర్థించారు. ఈ 16 నెలల్లో విశాఖ ఉక్కును కాపాడుకున్నామని.. అక్కడే రైల్వే జోన్‌ను ఏర్పాటు చేసుకున్నామని.. ఆగిపోయిన అమరావతికి నిధులు తెచ్చుకుని వేగంగా పనులు చేస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని.. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తంచేశారు. ఇంకా ఏం చెప్పారంటే..

**కసితో పనిచేస్తున్నాం..**

రాష్ట్రంలో 50 మంది ఎమ్మెల్యేలు కొత్తవారే. వారిలో నేనూ ఒకడిని. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారే. మేమంతా కసితో, పట్టుదలతో పనిచేస్తున్నాం. 1995లో చంద్రబాబు ఏ మ్యాజిక్ చేసి తెలుగువారు తలెత్తుకుని తిరిగేలా చేశారో అదే మ్యాజిక్ మళ్లీ చేయాలని ఆయన అహర్నిశలూ కష్టపడుతున్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా తీసుకెళ్తున్నారు. అంతర్జాతీయంగా ఏ దేశానికి వెళ్లినా తెలుగువారు కనిపిస్తారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా దాకా తెలుగువారు లేని దేశమేదీ ప్రపంచంలో లేదు. ఆస్ట్రేలియా ప్రభుత్వం కూడా ఒక తెలుగువాడిని అధికారిగా నియమించింది. ఆస్ట్రేలియా ప్రధానికి కూడా ఈ స్థాయిలో స్వాగతం ఉండదని సదరు అధికారి నాతో చెప్పారు. ఇక్కడి తెలుగువారి జోష్ వేరు. జాతర మాస్‌గా ఉంది. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ తెలుగువారికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చారు. తెలుగువారి పౌరుషాన్ని ఢిల్లీకి పరిచయం చేశారు. సీఎంగా గద్దె దింపితే ఢిల్లీని గడగడలాడించి తిరిగి గద్దెనెక్కారు. ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు. తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటారు. 1995లో పెద్దఎత్తున సంస్కరణలు అమలు చేసి రాష్ట్రాభివృద్ధికి మార్గం చూపారు.

**అప్పుడు ఎగతాళి చేశారు..**

కంప్యూటర్ కూడు పెడుతుందా అని ఆనాడు చాలా మంది చంద్రబాబును ఎగతాళి చేశారు. ఫ్లైఓవర్లు కడితే అభివృద్ధి జరిగినట్లా అని గేలి చేశారు. విమానాశ్రయాలు నిర్మిస్తే ఏం జరుగుతుందని ఆనాడు అవమానకరంగా మాట్లాడారు. అలా మాట్లాడిన వారి నోట ఇప్పుడు మాట రావడం లేదు. క్వాంటమ్ కంప్యూటింగ్ మాకే అర్థం కావడం లేదు. చంద్రబాబు మాత్రం నిశితంగా విశ్లేషిస్తున్నారు. అందుకే ఆయన్ను విజనరీ అంటాం. ఇంకొకరిని (పరోక్షంగా జగన్‌ను ప్రస్తావిస్తూ) ప్రిజనరీ అంటాం. ఇప్పుడు అర్థమైందా రాజా! ఆస్ట్రేలియాలోని తెలుగువారిని నాన్ రెసిడెంట్ ఇండియన్స్ (ఎన్‌ఆర్ఐ) అంటారు. నేను మాత్రం మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్ (ఎంఆర్ఐ) అని అంటాను. భారతీయులు సముద్రాలు దాటి వచ్చినా తమ దేశాన్ని, పుట్టిన ఊరును మరచిపోరు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగువారికి సొంత గడ్డపై ప్రేమాభిమానాలున్నాయి.

**రాజకీయాలు మనకు అవసరమా అని నాడు బ్రాహ్మణి అడిగింది**

**భావోద్వేగానికి గురైన లోకేశ్**

చంద్రబాబును నాడు జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసినప్పుడు.. రాజకీయాలు మనకు అవసరమా అని తన భార్య బ్రాహ్మణి తనను ప్రశ్నించిందని లోకేశ్ వెల్లడించారు. గౌరవంగా బతుకుతున్న మనం రాజకీయాలతో ఇన్ని అవమానాలు భరించాలా అని అడిగిందని చెప్పా రు. ఈ సమయంలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు. 'చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ప్రవాసులు ఎంతో బాధపడ్డారు. ఆయనకు, మా కుటుంబానికి మద్దతుగా నిలబడ్డారు. ఆస్ట్రేయాలోని ప్రతి నగరంలో నిరసనలు చేపట్టారు. ఆరోజు హైదరాబాద్‌కు 45 వేల మంది ప్రవాసులు వచ్చి చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఇదే.. ప్రజాసేవ ద్వారా నాయకుడిగా ఆదరణ పొందేందుకు నాకు స్ఫూర్తినిచ్చింది. మంచి నాయకుడికి ప్రపంచమే అండగా నిలిచిందని.. అందుకే రాజకీయాల్లో కొనసాగాలని ఆరోజున బ్రాహ్మణితో చెప్పాను. చంద్రబాబుకు సంఘీభావం తెలుపుతూ ప్రవాసులు తమ తమ గ్రామాలకు వెళ్లి పార్టీలు, ఎజెండాలు చూడకుండా కూటమి అభ్యర్థుల విజయం కోసం కష్టపడడం వల్లే 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో గెలిచాం. ఇలాంటి వేవ్ వస్తుందని నేనూహించలేదు. ఈ గెలుపు వెనుక ప్రతి ఒక్కరి కష్టం దాగి ఉంది. ఈ అద్భుత విజయం నాలో స్ఫూర్తిని నింపింది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం మరింత కష్టపడతా' అని హామీ ఇచ్చారు.

## పక్కన పెట్టిన గత వైసీపీ సర్కారు.. శిథిలావస్థలో ఈ-ఆటో

అక్టోబర్ 20: చెత్త నుంచి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలోనూ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఊరి బయట షెడ్లు నిర్మించి గ్రామంలో ఉత్పన్నమయ్యే తడి, పొడి చెత్తలను చెత్తసంపద కేంద్రాలకు తరలించి తద్వారా వర్మి కంపోస్టు తయారు చేసి పంట పొలాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో కోట్లాది రూపాయలను వెచ్చించింది. షెడ్ల నిర్మాణంతో పాటు ప్రతి గ్రామానికి చెత్తను తరలించేందుకు ఎలక్ట్రిక్ అటోలను పంచాయతీరాజ్ శాఖ కొనుగోలుచేసి ఆయా గ్రామాలకు అందించింది. అయితే ఆ కార్యక్రమం పట్టాలు ఎక్కక ముందే ప్రభుత్వం మారింది. గత వైసీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పక్కన పెట్టింది. దీంతో ఈ అటోలు మూలకు చేరి పనికి రాకుండా పోయాయి.ఒక్కొక్క ఈ-ఆటో కొనుగోలుకు సుమారు రూ.ఐదు లక్షలకు పైబడి వెచ్చించారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉన్న %=వీ% గ్రామాలకు గాను 62 గ్రామాలకు ఈ-ఆటోలను సరఫరా చేశారు. తడిచెత్త, పొడిచెత్తలను వేర్వేరుగా సమీకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించాల్సిన బాధ్యత ఈ ఆటోల నిర్వాహకుంది. సుమారు మూడున్నర కోట్ల రూపాయల వరకు ఖర్చు అవ్వగా తదనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఈ ఆటోలను పట్టించుకోకుండా పక్కన పెట్టేసింది. మరోవైపు తడి చెత్త, పొడి చెత్తను గ్రామం నుంచి తరలించేందుకు రూ.16 లక్షలు ఖర్చు చేసి రిక్షాలను కొనుగోలు చేశారు.వాస్తవంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా ఈ ఆటోలనే వినియోగంలోకి తీసుకొని వచ్చిఉంటే సంపద తయారీ కేంద్రాలను ఎప్పుడో గాడిలో పెట్టి. సంపద సృష్టించేందుకు అవకాశం కలిగేది. చెత్త సంపద కేంద్రాలకు ఉపయోగపడాల్సిన ఈ-ఆటోలు పూర్తిగా శిథిలమై చెత్తగా మారుతున్నా (స్క్రాప్) ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వాటికి పనికివచ్చే ఆటోలకు కాస్త మరమ్మతులు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని, పనికిరాని వాటిని వేలం వేయడం ద్వారా ప్రజా ధనాన్ని దుర్వి నియోగం కాకుండా. కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



# ఈ మారీచులతో జాగ్రత్త

**ప్రజాస్వామ్య యుద్ధంలో అంతా కలసి ఓడించారు**
**ఆ అక్కసుతో ప్రజల మధ్య విభేదాల సృష్టికి కుట్రలు**
**ఈ నయా నరకాసురులకు గుణపాఠం చెప్పాలి**
**ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తి అందిపుచ్చుకోవాలి**
**ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు**



అమరావతి, అక్టోబరు 19 దీపకాంతులతో శోభాయమానంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించుకొనే పండుగ దీపావళి అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలు గు ప్రజలందరికీ దీపావళి శు భాకాంక్షలు తెలిపారు. 'మన దేశంలో ప్రతి పండుగకూ ఒక పరమార్థం ఉంది. మనకు జీవన శైలిని నేర్పుతుంది. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి నిర్వహించుకుంటాం. దీపావళి స్ఫూర్తితో నయా నరకాసురులను ప్రజాస్వామ్య యుద్ధంలో ప్రజలందరూ కలిసి ఓడించారు. ఈ నరకాసురులు మారీచుల్లాంటివారు. రూపాలు మార్చుకొంటూ, తమను ఓడించారనే అక్కసుతో, ప్రజల మధ్య విభేదాలు సృష్టించి, అశాంతిని రేకెత్తించే కుట్రలకు దిగుతున్నారు. వీరిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి నయా నరకాసురులకు, వారి అనుచర గణానికి ఎప్పటికప్పుడు గుణపాఠం చెప్పాలి. ఆడపడుచులు సత్యభామ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి' అని ఆదివారం ఓ ప్రకటనలో పవన్ పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దీపావళిని పర్యావరణహితంగా చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆకాంక్షించారు. ఆరోగ్యం కంటే గొప్ప సంపద లేదని, ప్రజల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొంటూ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# రాజకీయ మూర్ఖులు ఎప్పటికీ బాగుపడరు

**పెట్టుబడులపై ఇష్టమొచ్చినట్లు వాగుతున్నారు**
**భవిష్యత్‌లో బ్రాండ్ ఏఐగా ఆంధ్రా**
**వైకుంఠపాళితో జీవితాలు బాగుపడవు**
**22 మంది ఎంపీలు ఉండడంతో కేంద్రంలో పనులన్నీ అవుతున్నాయి**
**ఉద్యోగులూ.. స్మార్ట్‌గా పనిచేయండి**
**సాయంత్రం 6 తర్వాత పనిచేయొద్దు**
**పున్నమి ఘాట్ దీపావళి వేడుకల్లో సీఎం**



అమరావతి/విజయవాడ, అక్టోబరు 19 'రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై ఇష్టం వచ్చినట్లు వాగుతున్నారు. రాజకీయ మూరు?లే అలా మాట్లాడతారు. వీళ్లు ఎప్పటికీ బాగుపడరు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీ నేతలపై మండిపడ్డారు. ఆదివారం విజయవాడలో కృష్ణా నది పున్నమి ఘాట్‌లో జరిగిన దీపావళి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖకు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి వచ్చిందన్నారు. 'ఏ అంటే ఆంధ్రప్రదేశ్.. రానున్న రోజుల్లో బ్రాండ్ ఏఐ గా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది. ఏఐలో విశాఖపట్నం హెడ్‌క్వార్టర్‌గా నిలుస్తుంది' అని చెప్పారు. పదేళ్లలో ఈ రంగంలో ఊహించనంత అభివృద్ధి జరుగుతుందని.. అన్ని రంగాల్లో పెనుమార్పులొస్తాయన్నారు. 'వైజాగ్ ఏఐ హబ్ నుంచే ప్రపంచం మొత్తానికీ సేవలు అందించాలి. యువత ఏఐ నేర్చుకుని ఈ అవకాశాన్ని ఉ పయోగించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా గూగుల్ సేవలందిస్తున్న ప్రతి ప్రాంతానికీ ఈ డేటా సెంటర్‌తో అవసరం ఉంటుంది. దీనిని ఉపయోగించుకోవాలనుకునే వారు వైజాగ్‌లో సంస్థలు పెడతారు. కేబుల్‌ను సింగపూర్ వరకు తీసుకెళ్లి ప్రపంచం మొత్తం అనుసంధానం చేస్తారు' అని చెప్పారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో వినియోగదారులు, చిరువ్యాపారులంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. వీటిపై దసరా నుంచి ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. 2019-24 మధ్య పండుగలే జరుపుకోలేని పరిస్థితులున్నాయని చెప్పారు. ఒకప్పుడు దసరా అంటే కోల్‌కతా, మైసూరు గుర్తొచ్చేవని.. ఈసారి దసరా అంటే విజయవాడ కూడా గుర్తొచ్చేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారని.. ఇందుకు 'వైబ్రెంట్ విజయవాడ'కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ అహ్మద్ బాబు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, గద్దె రామమోహనరావు, మాజీ ఎమ్మెల్యే బుద్దా వెంకన్న, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..నరకాసురుడికి ప్రజలే బుద్ధి చెప్పారు

సమాజాన్ని అతలాకుతలం చేసిన నరకాసురుడిని శ్రీకృష్ణుడు సత్యభామతో వచ్చి వధిస్తే.. రాష్ట్రంలోని నరకాసురుడికి ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పారు. ఏపీ చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయిలో 94 శాతం స్ట్రైక్ రేట్‌తో మా కూటమిని గెలిపించారు. రాష్ట్రంలో ఇక వైకుంఠపాళి వద్దు. అది ఉంటే మన జీవితాలు బాగుపడవు. 22 మంది ఎంపీలు ఉండడం వల్ల కేంద్రంలో అన్ని పనులూ అవుతున్నాయి. 16 నెలల్లో మళ్లీ ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టాం. రికార్డు స్థాయిలో పింఛన్లు, స్త్రీశక్తి, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, అన్న క్యాంటీన్లు, దీపం-2, ఆటోడ్రైవర్లకు సాయం అందించాం. అమరావతి పనులు ప్రారంభమయ్యాయి. రూ.50-60 వేల కోట్ల విలువైన పనులను మూడేళ్లలో పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ పెడుతున్నాం. వైజాగ్‌ను ఏఐ హబ్‌గా అభివృద్ధి చేయడానికి తొలి అడుగు పడింది.

స్వర్ణాంధ్ర నంబర్ వన్‌గా ఉండాలి..

2047నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఉంటుంది. అందులో స్వర్ణాంధ్ర ప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలని కోరుకుంటున్నాను. అది తప్పకుండా సాధ్యమవుతుంది. విజయవాడలో ఉండేవాళ్లు ప్రపంచంలో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు. మీతో పుట్టిన వాళ్లు పేదరికంలో ఉన్నారు. అలాంటి వారి బాధ్యతను పీ-4 కార్యక్రమం కింద తీసుకోవాలి.

ఉద్యోగులూ ఆరు తర్వాత పని చేయొద్దు

ఆ ఐదేళ్లలో ఎక్కడ చూసినా అప్పులే. ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ప్రభుత్వ ఉ ద్యోగులు ఎన్నికల్లో బాగా సహకరించారు. ఎన్ని కష్టాలున్నా వారికి దీపావళి శుభాకాంక్షలు చెప్పడం కోసమే డీఏ విడుదలకు నిర్ణయించాం. హెల్త్‌కార్డులు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చాం.

పోలీసులకు సరెండర్ లీవ్ ఎన్‌క్యాషమెంట్ ఇచ్చాం. ఉద్యోగులూ.. ఒకప్పుడు అందరం హార్డ్‌వర్క్ చేసేవాళ్లం.. ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాల్సిన అవసరం ఉంది. సాయంత్రం 6 తర్వాత పనిచేయొద్దు. విపత్తు సమయాల్లోనే ఎక్కువ పనిచేయండి. శని, ఆదివారాలు ఇంటి వద్దే నచ్చిన పనులు చేసుకుని సోమవారం నుంచి ఉ త్సాహంగా పనిచేయండి.

దీపావళి వేడుకల్లో చంద్రబాబు దంపతులు

పున్నమిఘాట్‌లో నిర్వహించిన దీపావళి వేడుకల్లో చంద్రబాబు బాణసంచా కాల్చే కార్యక్రమాన్ని రిమోట్‌తో ప్రారంభించారు. భార్య భువనేశ్వరితో కలిసి బాణసంచా వెలుగులను ఆస్వాదించారు. ఆ వెలుగులను తన మొబైల్ ఫోన్‌లో బంధించారు. మధ్యమధ్యలో చిన్నారులను పలుకరిస్తూ ఆప్యాయంగా మాట్లాడారు.

# చారాల చెరువు మొరవ ఉధృతం



చౌడేపల్లె, అక్టోబరు 19 చారాల చెరువు మొరవ వుధ్రుతం కావడంతో పంటలు నీటమునిగాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో పెద్ద చెరువుల్లో ఒకటైన చారాల చెరువు మొరవ పోతోంది. జంగాలపల్లె-చారాల మార్గంలో మొరవ నీళ్ళు వుధ్రుతంగా ప్రవహించడంతో రాక పోకలు బందయ్యాయి. జంగాలపల్లెకు వెళ్ళాలంటే చారాల నుంచి చౌడేపల్లెకు వెళ్లి అక్కడి నుంచి బీర్జేపల్లె మీదుగా సుమారు 10 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్ళవలసిన పరిస్థితి నెలకొంది. జంగాలపల్లెకు చెందిన రెడ్డెప్ప ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంలో చౌడేపల్లెకు వెళుతుండగా మొరవనీటిలో కొట్టుకు పోయారు. గమనించిన స్థానికులు ఆయనకు తాడు అందించి రక్షించారు.తాళ్ళసాయంతో ఆయన ద్విచక్రవాహనాన్ని ఒడ్డుకు చేర్చారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సుమారు 100 ఎకరాలకు పైగా వరి పంటలు నీట మునిగింది. అలాగే శెట్టిపేట వద్ద వంకాయ తోటతో పాటు, పలువురు రైతులకు చెందిన వరి పంటలు కూడా నీట మునిగాయి.పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఏవో మోహన్‌కుమార్ తెలిపారు.

# కంభంలో దీపావళి టపాసులు కొనేవారు లేక వెలవెలబోతున్న దుకాణాలు



కంభం, అక్టోబరు 19 అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న జల్లులకు బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. వానలకుతోడు దీపావళి ధరలు తారాజువ్వల్లా ఆకాశానికి అంటుతుండడం కూడా మరో కారణంగా భావిస్తున్నారు. గతం లో ఎప్పుడూ లేని విధంగా దీపావళి టపాసుల ధరలు అధికంగా ఉండడంతో అంత రేట్లు పెట్టి కొనాలా వద్దా అనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు. ఆదివారం రాత్రి కూడా వాన కురిసింది. బాణసంచా అంత రేట్లు పెట్టి కొనే బాధ తప్పుతుందని పలువురు బహిరంగంగానే అనుకోవడం కనబడుతుంది. బాణసంచా లైసెన్స్ సంపాదించి దీపావళి సరుకులు విక్రయించే వ్యాపారులు మాత్రం బాణసంచా లైసెన్స్ సంపాదించేందుకు పోలీస్, రెవెన్యూ అగ్నిమాపక సిబ్బందికి వేల రూపాయలు ఇచ్చామని, మరోపక్క బాణసంచా కొనుగోలుకు పెట్టిన పెట్టుబడి అన్నీ కలిపి తాము లాభాల బాట పట్టాలంటే ఆమాత్రం ధరలకు అమ్మాల్సిందేనని చెప్తున్నారు.గిద్దలూరు, బంగారం, వెండి ధరలు దీపావళి టపాసుల లాగా ఆకాశాన్ని అంటాయి. దాంతో ధన త్రయోదశి అయినప్పటికీ బంగారు, వెండి ఆభరణాలను కొనలేని పరిస్థితి నెలకొన్నది. దాంతో బంగారు, వెండి దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. అక్షయతృతీయ, ధన త్రయోదశి రోజుల్లో బంగారం, వెండి వస్తువులు కొనుగోలు చేసి ఇంటికి తెచ్చుకుంటే మంచిదన్న భావన ప్రజల్లో నెలకొన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే బంగారు, వెండి ధరలు ఊహించనంతగా పెరగడంతో సామాన్యులకు, మధ్యతరగతి వారికి అందుబాటులో లేకుండా పోయాయి. కనీసం లక్ష్మీకాసులను కూడా కొనలేనంత రేట్లు పెరగడంతో కొనుగోలుదారులు బంగారు దుకాణాలవైపు చూడలేదు.

# ముస్లింలకు అట్రాసిటీ చట్టం తీసుకురావాలి



మంగళగిరి, అక్టోబరు 19 ముస్లింల భద్రత కోసం ప్రత్యేక అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అ?ధ్యక్షుడు సాలాఉద్దీన్ కోరారు. మంగళగిరి ఈద్గా ఫంక్షన్‌హాలులో ఆదివారం జరిగిన ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలపై జరుగుతున్న దాడులు, వివక్షను అడ్డుకోవాలంటే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం మాదిరి ప్రత్యేక చట్టాన్ని తేవాల్సిందేనన్నారు. విద్య, ఆర్థిక రంగాల్లో ముస్లింలకు మరింత ప్రాధాన్యతను ఇచ్చేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# కార్తీకం.. శైవ క్షేత్రాల దర్శనం కోసం ఆర్టీసీ ఏర్పాట్లు

కాకినాడ, అక్టోబర్ 20: పరమ శివునికి ఇష్టమైన మాసం కార్తీక మాసం. ఈ నెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో చాలా మంది పంచారామాలతోపాటు శైవ క్షేత్రాలను సందర్శిస్తారు. ఇక అయ్యప్ప మాలధారులు సైతం శబరిమలకు వెళ్తుంటారు. ఆ భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ బస్టాండ్ల నుంచి మొత్తం 157 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది.

శ్రీశైలానికి రోజూ..

కాకినాడ నుంచి శ్రీశైలంకు ప్రతి రోజూ ఉదయం 7.45 గంటలకు బస్సు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ వివరించింది. ఈ బస్సులు ఈ మాసం మొత్తం నడుస్తాయని వివరించింది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అవసరమైతే మరిన్ని పెంచుతామని చెప్పింది.శని, ఆదివారాల్లో పంచారామ క్షేత్రాలు..

ఈ మాసం పురస్కరించుకుని ప్రతి శని, ఆదివారాల్లో పంచారామ క్షేత్రాలను దర్శించేందుకు వీలుగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అక్టోబర్ 25, 26 తేదీలతోపాటు నవంబర్ 2,9, 16 తేదీల్లో జిల్లాలోని వివిధ బస్టాండ్ల నుంచి ఈ బస్సులు బయల్దేరతాయని వివరించింది. తద్వారా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకోవచ్చు. గత ఏడాది ఇదే నెలలో 26 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా.. ఈ సారి వాటి సంఖ్యను 36కి పెంచారు. సూపర్ లగ్జరీ ధర రూ.1,120, అల్ట్రా డీలక్స్ ధర రూ.1,070గా నిర్ణయించారు.

శబరిమల యాత్ర..




జిల్లాలోని ప్రధాన బస్టాండ్లు కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోల నుంచి శబరిమలకు కొత్త సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులను తిప్పనున్నారు. గతేడాది శబరిమలకు 4 ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ సారి ఆ సంఖ్యను 8కి పెంచనున్నారు. అలాగే అయ్యప్ప భక్తులు.. వారు కోరుకున్న చోటు నుంచి ఈ ప్రత్యేక సర్వీసులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ బస్సు సర్వీసుల్లో ప్రయాణించేందుకు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే అవకాశంతోపాటు ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని సైతం కల్పించినట్లు ఆర్టీసీ అధికారులు వివరించారు.

# దీపావళి.. అక్రమ బాణసంచా విక్రయాలపై డ్రోన్ నిఘా .. పోలీసుల కఠిన చర్యలు



ఒంగోలు క్రైం,అక్టోబరు దీపావళి పండుగ అంటే బాణసంచా కాల్చడం పరిపాటి. బాణసంచా తయారీకి తమిళనాడు రాష్ట్రంలో శివకాశి పెట్టిందిపేరు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాలు కూడా శివకాశి నుంచి బాణసంచా తీసుకొచ్చి విక్రయాలు చేస్తుంటారు. అందుకు సంబంధించి హెూల్‌సేల్ వ్యాపారులు అటు ప్రజల జేబులకు చిల్లు పెటడంతోపాటుగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. జిల్లాలో 14 మంది హెూల్‌సేల్ వ్యాపారులు ఉండగా ఒంగోలులో ఉన్న ఓ వ్యాపారి ఇతర రాష్ట్రాలకు కూడా బాణసంచా సరఫరా చేసి సొమ్ము చేసుకుంటారు. అయితే దీపావళి పండుగ ఒక్కరోజు అయినా జిల్లాలో సుమారుగా రూ. 20 కోట్లకు పైగా బాణసంచా విక్రయాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి వ్యాపారం అక్రమాలకు అవధులు లేకుండా పోవడానికి కారణం అధికారులు పట్టించుకోకపోవడమే. బాణసంచా వ్యాపారం మొత్తం జీరోలోనే జరుగుతుంది. బాణసంచా వ్యాపారంలో 18 శాతం జీ ఎస్టీ చెల్లించాలి. జీఎస్టీ చెల్లించి శివాకాశి నుంచి వచ్చే బాణసంచా తక్కువగా ఉంటుంది.అదే క్రమంలో శివకాశి నుంచి తెచ్చిన బాణసంచా మొత్తం బిల్లులు లేకుండా వ్యాపారం చేస్తారు. అంటే అక్కడ ఎంతకు కొనుగోలు చేసింది, ఎంత మొత్తం బిల్లులపై తెచ్చారు అనేది ప్రశ్నార్ధకం. ఇలాంటి వ్యాపారంపై అధికారుల నిఘా కొరవడడంతో ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తూ,హెూల్‌సేల్ వ్యాపారులే అధికధరలకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుండా కేవలం బాణసంచా మత్తులో ఉండటంతో వ్యాపారులు చెలరేగుతున్నారు.

పేలుతున్న ధరలు

బాణసంచా ధరలు గత ఏడాది కంటే ఈ ఏడాది మండిపోతున్నాయి. సామాన్యులు టపాసుల ధరలు చూసిముక్కున వేలు వేసుకుంటున్నారు. ఐదు నుంచి ఆరువేల రూపాయలకు కొనుగోలు చేసినా చేతి సంచిలోకి రావడంలేదని పలువురు వాఖ్యానిస్తున్నారు. చిచ్చుబుడ్డి పట్టుకుంటే కాల్చకుండానే మంటలు వస్తున్నాయి. లక్ష్మీబాంబులు మోతమోగుతున్నాయి.. ఇలా ధరలు ఎగిసిపడుతున్నాయి. దీంతో టపాసులు కొనుగోలు చేయడం అంతంతమాత్రంగా ఉంది.

అనుమతులు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు – ఎస్పీ వి.హర్షవర్ధనరాజు

బాణసంచా విక్రయదారులు నిబంధనలకు లోబడి విక్రయాలు చేయాలి. అనుమతులు లేకుండా టపాసులు తయారు చేయడం, అక్రమ రవాణా చేయడంపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం. డ్రోన్ కెమోరాలతో నిఘా ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా అనుమతిలేకుండా విక్రయాలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి రూ1,38,944 విలువ గల బాణసంచాను సీజ్ చేశాం. దీపావళి సందర్భంగా ఏవైనా అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే 101, పోలీసు డైల్ 100 లేక 112కు సమాచారం అందిచాలి.దీపావళి సందర్భంగా నగరంలో 42 బాణ సంచా దుకాణాలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో అనుమతులిచ్చారు. ఈ మేరకు ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూలు క్రీడా మైదానంలో ప్రత్యేకంగా టపాసుల అమ్మకాలు చేయనున్నారు. కాగా గతంలో షాపులకు విపరీతమైన పోటీ ఉండగా, ఈ ఏడాది 42 దరఖాస్తులు మాత్రమే రాగా, అన్నింటికీ అనుమతిలిచ్చారు. దీంతో పీవీఆర్ మైదానంలోనే షాపులు పెట్టుకోవాలని ఆదేశించారు. అయితే నివాసాల మధ్య టపాసులు అమ్మకూడదని, అలాగే వ్యాపార సముదాయాలు, బహిరంగ ప్రదేశాలలో షాపులు ఏర్పాటు చేయకూడదని హెచ్చరించారు. పీవీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల ముందు తప్పనిసరిగా నీళ్ల డ్రమ్ములు, ఇసుక డ్రమ్ములు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

# రైతులకు అలర్ట్.. ధాన్యం సేకరణలో కీలక మార్పు.. ఇక ఆ ఇబ్బంది ఉండదు..

ఆంధ్రప్రదేశ్‌లోఅక్టోబర్ 27 నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల వెల్లడించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే ఈసారి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం సరళీకృతమైన విధానాలను అనుసరించనుంది. ఈ క్రమంలోనే ఇకపై ఈ కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల నుంచి ఈ– కేవైసీ నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ధాన్యం సేకరణ ప్రక్రియలోఎన్ని సంస్కరణలు చేపట్టినా కూడా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.

రైతుల నుంచి దళారులు, కమీషన్ ఏజెంట్లు పట్టాదారు పాసుపుస్తకాలు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాలు, ఆధార్ వివరాలు సేకరిస్తున్నారు. వాటిని సిబ్బంది సహకారంతో నమోదు చేయించే ఘటనలు జరుగుతున్నాయి. ఆ తర్వాత రైతుల నుంచి ఈ దళారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి.. ప్రభుత్వానికి కనీస మద్దతు ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రైతులు నష్టపోతుండగా.. దళారులు భారీగా లబ్ధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల ఈ కేవైసీ పూర్తి చేయాలని నిర్ణయించింది. అలాగే గతంలో వ్యవసాయ శాఖ, పౌరసరఫరాల శాఖ వేర్వేరుగా ఈ కేవైసీ వివరాలు రైతుల నుంచి సేకరించేవి. అయితే ఇక



మీదట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఈ ప్రక్రియ పూర్తిచేసేలా రూల్స్ మార్చారు. మరోవైపు ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా ఏపీ ప్రభుత్వం గతేడాది 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో 51 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించింది. అలాగే ఈ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. తేమ శాతం కొలిచే యంత్రాల నుంచి గన్నీ బ్యాగుల వరకూ, అలాగే రవాణా సదుపాయాలు ముందుగానే సిద్ధం చేయనుంది. అక్టోబర్ 27 నుంచి 3013 రైతు సేవా కేంద్రాలు, 2061 పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో..10,700 మంది సిబ్బందితో ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టనుంది.

# టీటీడీ ఆలయంలో ఇంత నిర్లక్ష్యమా..




### టీటీడీకి చెందిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్లక్ష్యం
### టీటీడీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలో వెలుగుచూసిన నిర్లక్ష్యం

అధికారులు, సిబ్బందిపై సీరియస్ అయిన బీఆర్ నాయుడుతిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నడిచే ఆలయాల్లో ప్రతి స్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు .. అమరావతిలోని వెంకటపాలెం సమీపంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. సాధారణ భక్తుడిలా నడుచుకుంటూ దర్శనానికి వెళ్లారు. ఆలయానికి చేరుకోగానే టెంపుల్ అర్చకులు, ఇన్స్పెక్టర్లు శ్రీ రామకృష్ణ, సందీప్ స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో భక్తులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. తర్వాత కొందరు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ నాయుడు పరిశీలనలో అక్కడున్న సిబ్బంది అసలు బాగోతం బయటపడింది. ఆలయ పరిశుభ్రత, నిర్వహణలో లోపాలు చూసి అధికారులపై సీరియస్ అయ్యారు. దేవదేవుడి అలంకరణ, క్యూలైన్లు, ఏర్పాట్లుపై స్థానిక అధికారులు, సిబ్బందిపై టీటీడీ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ఉద్యోగులు ఇలాంటి నిర్లక్ష్యాన్ని వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, నిర్వహణ మరింత నాణ్యంగా ఉండాలని అధికారులకు ఆయన సూచించారు. అనంతరం సోషల్ మీడియా వేదికగా కీలక ట్వీట్ పెట్టారు.ఇకపై దేశం మొత్తం ఇదే తీరు..

“ఈరోజు (అక్టోబర్ 20) ఆకస్మికంగా వెంకటపాలెం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని తనిఖీ చేశాను. సాధారణ భక్తుడిలా దర్శనానికి వెళ్లి, ఆలయ నిర్వహణలో కొన్ని నిర్లక్ష్యాలు గమనించాను. దేవదేవుడి అలంకరణ నుంచి – సిబ్బంది తీరు వరకు నిర్లక్ష్యం కనిపించడం బాధాకరం. ఇలాంటి వైఖరిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. భక్తుల సేవలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. ఇకపై దేశంలోని అన్ని శ్రీవారి ఆలయాలను ఆకస్మికంగా సందర్శిస్తూ, భక్తులకు అందించే సేవా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాము” అని బీఆర్ నాయుడు ట్వీట్ చేశారు.దళారుల బారిన పడకండి..మరోవైపు, శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు వసతి కోసం దళారులను నమ్మి మోసపోవద్దని బీఆర్ నాయుడు శనివారం (అక్టోబర్ 18) భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో కొందరు దళారులు, మధ్యవర్తులు శ్రీవారి దర్శనం పేరుతో భక్తులను పలు మార్గాల ద్వారా మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా ప్రభావిత స్థానాల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులమని కొందరు మాయమాటలు చెప్పి.. శ్రీవారి బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కల్పిస్తామని ప్రలోభ పెడుతున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి నకిలీ వ్యక్తులు.. భక్తుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేసి మోసం చేస్తున్నట్లు అనేక ఘటనలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటికే భక్తులను మోసం చేస్తున్న అలాంటి వారిని.. టీటీడీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.





# పార్వతీపురం చెరువుకు చేరిన సాగర్ జలాలు

అద్దంకి, అక్టోబరు 18 మండలంలోని పార్వతీపురం చెరువుకు సాగర్ జలాలు చేరాయి. దీంతో గ్రామస్థులు జలహారతి ఇచ్చారు. మోదేపల్లి మేజర్ చివరి ఆయకట్టులోని కొటికలపూడి పంచాయతీ పరిధిలోని పార్వతీపురం చెరువుకు నీరు రావడం గగనంగా మారింది. ఈ నేపథ్యంలో కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్ రూ.లక్ష సొంత నిధులు వెచ్చించి 5 రోజులు గా ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి సాగర్ కాలువలలో జంగిల్ క్లియరెన్స్ చేయించారు. దీంతో శనివారం సాయంత్రానికి సాగర్ జలాలు పార్వతీపురం చెరువుకు చేరాయి. దీంతో పార్వతీపురం, వేణుగోపాల పురం గ్రామాలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. పశువుల నీటికి కూడా ఇబ్బందులు తొలగిపోను న్నాయి. సాగర్ జలాలు చెరువుకు చేరడంతో సర్పంచ్ పూనాటి విక్రమ్ ఆధ్వర్యంలో మహిళలు పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. సాగర్ జలాలు చెరువకు చేరడంతో పార్వతీపురం, కొటికలపూడి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చంద్రబాబుకు ఆ రిక్వెస్ట్ చేశాను.

### తిరుమల శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ కవిత
### చంద్రబాబుపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు
### తన రిక్వెస్ట్‌పై సానుకూలంగా స్పందించారన్నారు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తాను చేసిన రిక్వెస్ట్‌పై సానుకూలంగా స్పందించిన విషయాన్ని ప్రస్తావించారు ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కవిత.. హాథిరాం బావాజీ మఠానికి వెళ్లారు. తిరుమలలోని హాథిరాం బావాజీ మఠం బార్సీ ఉత్సవంలో భాగంగా నిర్వహించిన భోగ్ భండార్ కార్యక్రమంలోపాల్గొన్నారు. బంజారాల ఆరాధ్య దైవమైన హాథిరాం బావాజీ మఠంలో తమకు తగిన స్థానం కల్పించాలని కోరుతున్న దక్షిణ భారతదేశంలోని బంజారా సాధు సంత్‌ల పక్షాన నిలబడి ఉంటామని హామీ ఇచ్చారు.నేను హాథిరాం బావాజీ మఠానికి దగ్గరకు వచ్చాను.. అక్కడ సరైన సౌకర్యాలు లేక బంజారా సమాజం ఇబ్బందిపడుతున్నారు.. వారిని కలిసి ధైర్యం చెప్పాము. గతంలో మఠం కూలగొడుతున్నారని తెలిసి.. నేను అమెరికాలో ఉన్నాను.. కూలగొట్టొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రిక్వెస్ట్ చేశాము. ఆ సమాజాన్ని సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని కోరాము. ఈ ప్రభుత్వం ఆ సమాజం మనోభావాలను గౌరవించి ఆ నిర్ణయాన్ని ఆపేశారు.. భవిష్యత్‌లో బంజారా సమాజం చేపట్టే కార్యక్రమాల్లో వారి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని కోరుతున్నాము. హాథిరాం బావాజీ మఠం విషయంలో టీటీడీ ఛైర్మన్‌ను కలిశాను.. ఆయన చాలా పాజిటివ్‌గా స్పందించారు’ అని వివరించారు.తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. ఈనెల 25 నుంచి తెలంగాణ జాగృతి జనంబాట కార్యక్రమాన్ని సంకల్పించాను. నాలుగు నెలలపాటు సాగనున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించాను. ఆ కార్యక్రమాన్ని విన్నవించుకునేందుకు ఇక్కడికి వచ్చాను.. స్వామి వారి దయవల్ల నాలుగు నెలల పాటు ప్రజలతో మమేకం అయ్యే ఈ యాత్రకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని వచ్చాను. తెలంగాణ, ఆంధ్ర రెండు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలి, బాగుండాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా కోరుకున్నాను’ అని వివరించారు.ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌తో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు టీటీడీ అధికారులు కవిత దంపతులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో.. కవిత, అనిల్ దంపతులకు పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.



# సినిమా



## ప్రముఖ హాస్య నటుడు కన్నుమూత..

ప్రముఖ నటుడు అస్రానీ 84 సంవత్సరాల వయసులో మరణించారు. ఆయన మేనల్లుడు అశోక్ అస్రానీ ఈ వార్తను ధృవీకరించారు. హిందీ సినిమా రంగంలో సీనియర్, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన గోవర్ధన్ అస్రానీ ఈ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో దీర్ఘకాలిక అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. రాజస్థాన్‌లోని జైపూర్ నివాసి అయిన అస్రానీ జైపూర్‌లోని సెయింట్ జేవియర్స్ స్కూల్ నుండి విద్యను అభ్యసించారు.

హాస్య నటన రంగానికి అస్రాని అందించిన సహకారం అమూల్యమైనది. అనేక దశాబ్దాలుగా, ఆయన హిందీ సినిమాకు అనేక చిరస్మరణీయ పాత్రలను పోషించారు. ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. అస్రాని కెరీర్ అతని బహుముఖ ప్రజ్ఞ, దీర్ఘాయువుకు నిదర్శనం. ఐదు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో రాణిస్తూ.. 350 కి పైగా చిత్రాల్లో నటించారు. హాస్య, సహాయ నటుడిగా ఆయన అత్యంత ముఖ్యమైన సహకారం, ఈ పాత్రలు అనేక ప్రధాన హిందీ చిత్రాలకు వెన్నెముకగా నిలిచాయి.

1970లు అతని కెరీర్ శిఖరాగ్ర స్థాయికి చేరుకుంది. 'మేరే అప్నే', 'కోషిష్', 'బావర్చి', 'పరిచయ్', 'అభిమాన్', 'చుప్కే చుప్కే', 'చోటీ సి బాత్', 'రఫూ చక్కర్' వంటి దిగ్గజ చిత్రాలలో నటించి, అత్యంత క్యారెక్టర్ నటులలో ఒకరిగా ఎదిగాడు. 1975లో విడుదలైన అత్యంత ప్రజాదరణ పొందిన చిత్రం 'విచిత్రమైన జైలు వార్డెన్' పాత్ర మరపురాని సాంస్కృతిక గీటురాయిగా మారింది. కామిక్ టైమింగ్, డైలాగ్ డెలివరీలో అతను తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.

నటనతో పాటు, అస్రాని చిత్రనిర్మాణంలోని ఇతర కోణాల్లో కూడా చెప్పుకోదగ్గ విజయాలు సాధించారు. ముఖ్యంగా 1977లో విమర్శకుల ప్రశంసలు పొందిన హిందీ చిత్రం 'చల మురారి హీరో బన్నే'లో కొన్ని చిత్రాలలో ప్రధాన హీరోగా విజయవంతంగా మారారు. ఈ చిత్రాన్ని ఆయనే రచించి దర్శకత్వం వహించారు. 'సలాం మేమ్‌సాబ్' (1979) వంటి చిత్రాలతో పాటు తన కెరీర్‌లో అనేక ఇతర చిత్రాలతో దర్శకుడిగా కూడా ఆయన ప్రయత్నించారు. ఆయన పని గుజరాతీ సినిమా వరకు విస్తరించింది, అక్కడ ఆయన ప్రధాన పాత్రలు పోషించి 1970లు, 1980లలో గణనీయమైన విజయాన్ని సాధించారు. బహుళ సృజనాత్మక పాత్రలను అన్వేషించాలనే ఈ సంకల్పం కేవలం నటుడి పరిధికి మించి సినిమా కళ పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తుంది.





## రోజూ నాలుగు ఈ పండ్లు తిన్నారంటే.. బీపీ తగ్గడంతో పాటు గుండె బలంగా ఉంటుంది..!

నేటి వేగవంతమైన,ఒత్తిడితో కూడిన జీవితం అన్ని వయసుల వారిని ఏదో ఒక విధంగా ప్రభావితం చేసింది. ఆహారపు అలవాట్లు క్షీణించాయి. నిద్రలేమి వెంటాడుతోంది. శరీర కార్యకలాపాలు దాదాపు సున్నా అయ్యాయి. అటువంటి పరిస్థితిలో మన శరీరంలో మనం తక్కువ శ్రద్ధ చూపే భాగం అంటే కడుపు ఎక్కువగా ప్రభావితమవుతుంది. సాధారణంగా బొడ్డు కొవ్వు అని పిలువబడే ఉదర కొవ్వు ఆరోగ్యానికి ప్రమాదకరం. ఇది క్రమంగా మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుంది. ఈ రోజుల్లో చాలా మంది ప్రజలు ఈ సమస్యతో పోరాడుతున్నారు. పరిష్కారంగా వారంతా జిమ్ లేదా మార్కెట్లో లభించే ఖరీదైన, రసాయనాలతో నిండిన ఉత్పత్తుల వైపు చూస్తున్నారు. దీని ప్రభావం నెమ్మదిగా లేదా శాశ్వతంగా ఉండదు. కానీ, ఆయుర్వేద పద్ధతులను ఉపయోగించడం వల్ల బొడ్డు కొవ్వు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. అదేలాగో ఇక్కడ చూద్దాం..

టమాటాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో వాత, పిత్త, కఫ సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడతాయి. అవి సహజమైన డిటాక్స్‌గా పనిచేస్తాయి. శరీరాన్ని తేలికగా, శుభ్రంగా, శక్తివంతంగా ఉంచుతాయి. ముఖ్యంగా, వీటిని ఏ వయసు వారైనా ఆహారంలో చేర్చుకోవచ్చు. ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు.

రోజుకు రెండుసార్లు భోజనానికి ముందు 3 నుండి 4 పండిన టమోటాలు తినడం వల్ల బొడ్డు కొవ్వు క్రమంగా తగ్గుతుంది. టమాటాలలోని పోషకాలు శరీర జీవక్రియను పెంచుతాయి. ఇది కొవ్వును వేగంగా కాల్చడానికి సహాయపడుతుంది. టమోటాలలో లైకోపీన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఉంటుంది, ఇది శరీరం నుండి హానికరమైన విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. శరీరం లోపలి నుండి శుభ్రంగా ఉన్నప్పుడు, జీవక్రియ కూడా మెరుగ్గా పనిచేస్తుంది.టమాటాలలో విటమిన్లు ఎ, సి, పొటాషియం, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి. ఫైబర్ మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది అతిగా తినకుండా నిరోధిస్తుంది. కేలరీలను నెమ్మదిగా బర్న్ చేయడంలో సహాయపడుతుంది.

టమోటాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సాధారణ కడుపు సమస్యలను తగ్గిస్తుంది. అల్పాహారం, రాత్రి భోజనానికి ముందు టమాటాలు తినడం వల్ల వేగవంతమైన ఫలితాలు కనిపిస్తాయి. కొంతమంది రుచి కోసం కొద్దిగా రాతి ఉప్పు, నల్ల మిరియాలు కూడా కలుపుకుంటారు. ఇది మరింత రుచికరమైనదిగా చేస్తుంది. శరీరంలో మంట లేదా వేడిని నివారిస్తుంది.



## పీరియడ్స్ నొప్పులు తగ్గాలా? ఈ సింపుల్ టిప్స్ పాటిస్తే నెలసరిలోనూ ఫుల్ యాక్టివ్..!


మహిళల శరీరంలో పీరియడ్స్ అనేది ఒక సహజ ప్రక్రియ. క్రమం తప్పకుండా ఉండటం ఆరోగ్యానికి చాలా కీలకం. అయితే, చాలా మంది మహిళలకు పీరియడ్స్ అనేది తీవ్రమైన సమస్య. వారు మానసిక స్థితిలో మార్పులనే కాకుండా భరించలేని నొప్పి, తిమ్మిరిని కూడా ఎదుర్కొంటారు. ముఖ్యంగా వారికి పీరియడ్స్ మొదటి మూడు రోజులలో కొందరు తీవ్రమైన నొప్పి, తిమ్మిరిని అనుభవిస్తారు. దీని వలన రోజువారీ పనులు చేయడం కష్టమవుతుంది. చాలా మంది మహిళలు నొప్పి నుండి ఉపశమనం పొందడానికి మందులను ఆశ్రయిస్తారు. కానీ, నొప్పి నివారణ మందులు శరీరంపై అనేక ప్రతికూల ప్రభావాలను చూపుతాయి. మందులకు బదులుగా, మీరు మీ పీరియడ్స్ తిమ్మిరిని ఇంటి నివారణలతో చికిత్స చేయవచ్చునని పలువురు పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బాధాకరమైన పీరియడ్స్ నుండి ఉపశమనం పొందడానికి ఐదు నివారణలు ఉన్నాయి. అవేంటో ఇక్కడ చూద్దాం..యోగాతో మీ నొప్పిని తగ్గించుకోవచ్చు. మత్స్యాసనంగా పిలువబడే యోగా భంగిమ ఈ సమయంలో చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుంది. ఈ యోగా భంగిమ దిగువ శరీరానికి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది ఋతు ప్రవాహం సజావుగా సాగడానికి దారితీస్తుంది. అలాగే, మీ ఋతు కాలంలో ఎటువంటి దూకుడు వ్యాయామాలు చేయరాదు. ఈ సమయంలో సోంపు నీటిని తాగవచ్చు. దీనిని తయారు చేయడానికి ఒక గ్లాసు నీరు తీసుకొని ఒక టీస్పూన్ సోంపు గింజలను వేయాలి. ఒక చిటికెడు క్యారమ్ గింజలను కూడా వేసుకోవాలి. తరువాత, ఈ నీటిని బాగా మరిగించి వడకట్టండి. ఋతు నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి రోజంతా ఈ నీటిని త్రాగండి. ఇది శరీరంలో చిక్కుకున్న వాయువు, ఉబ్బరం నుండి ఉపశమనం పొందటానికి కూడా సహాయపడుతుంది.

## హే మ్యాన్ కమ్ టు మై క్యాబిన్.. ఫోటో గ్రాఫర్ ను బస్సులోకి రమ్మన్న రోహిత్ శర్మ..

ఆస్ట్రేలియాతో జరగనున్న కీలకమైన రెండవ వన్డే కోసం అడిలైడ్ చేరుకున్న భారత క్రికెట్ జట్టుకు అభిమానులు ఘనస్వాగతం పలికారు. అభిమానులు టీమిండియా ఆటగాళ్లను చుట్టుముట్టారు. సోమవారం సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక వీడియోలో రోహిత్ శర్మ విలేకరులు తమలో తాము మాట్లాడుకుంటుండగా, బస్సులోకి ఆహ్వానిస్తున్నట్లుగా సైన్ చూస్తూ కనిపించాడు. భారత క్రికెట్ జట్టు అడిలైడ్‌కు చేరుకోగానే అభిమానులు, ఫోటోగ్రాఫర్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. రోహిత్ శర్మ బస్సులోకి వెళ్ళేటప్పుడు, విలేకరుల వైపు చూసి, ఏదో చెప్పి, వారిని బస్సులోకి ఆహ్వానిస్తున్నట్లుగా ఒక సైగ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అదే సమయంలో విరాట్ కోహ్లీ అభిమానుల ఆటోగ్రాఫ్‌లు తీసుకున్న తర్వాత టీమ్ బస్సులోకి వెళ్ళాడు.సిరీస్ ఓపెనర్‌లో మిచెల్ మార్ష్, అతని జట్టు చేతిలో ఓడిపోయిన తర్వాత, టీమిండియాకు రెండవ వన్డేలో గెలవడం చాలా ముఖ్యం. మొదటి మ్యాచ్‌లో నిరంతరాయంగా వర్షం అంతరాయాలు ఏర్పడటం భారత్ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడానికి ప్రధాన కారణం. చివరి సుదీర్ఘ విరామం తర్వాత, మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించగా, భారత్ 136/9 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆతిథ్య జట్టు ఆస్ట్రేలియా ఏడు వికెట్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.మొదటి మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరూ విఫలమైనప్పటికీ, మాజీ భారత ఓపెనర్ సునీల్ గవాస్కర్ రాబోయే రెండు మ్యాచ్‌లలో ఈ అగ్రశ్రేణి ఆటగాళ్లు పెద్ద స్కోర్లు




చేస్తారని సూచించారు. మార్చి తర్వాత మొదటిసారి అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నందున, వారికి కొంత సమయం ఇవ్వాలని అభిమానులను కోరారు. అతను ఇండియా టుడేతో మాట్లాడుతూ.. "వారు బహుశా ఆస్ట్రేలియాలోని అత్యంత బౌన్సీ పిచ్‌పై ఆడుతున్నారు. ముఖ్యంగా కొన్ని నెలలుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడలేని ఆటగాళ్లకు ఇది అంత సులభం కాదు. శుభమన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ కూడా రెగ్యులర్‌గా ఆడుతున్నప్పటికీ, ఇది వారికి కూడా సవాలుతో కూడుకున్నది. భారత్ ఇప్పటికీ చాలా, చాలా మంచి జట్టు. రోహిత్, కోహ్లీ రాబోయే రెండు మ్యాచ్‌లలో భారీ స్కోర్లు చేస్తే ఆశ్చర్యపోకండి." గతసారి ఈ రెండు జట్లు అడిలైడ్‌లో వన్డే ఆడినప్పుడు భారత్ ఆస్ట్రేలియాను ఓడించింది. ఈసారి కూడా అదే ఫలితం వస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.




Printed by katikala Vara Prasad. Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .H.NO. 1-94, NEKUNAMPURAM, POKUR, PRAKASAM, ANDHRA PRADESH - 523113.. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2843.
Ph:9849707349 . email:kvp6858@gmail.com.